క్లుప్తంగా

ముగిసిన వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు



నల్లకుంట: మెహిదీపట్నం, బోయిన్‌పల్లిలోని ఇండియన్ ఆర్మీ యూనిట్స్ ఒప్పందంతో శివం రోడ్డు ఏటీఐ సెంటర్‌లో ఎన్ఎస్‌టీఐ, డీజీటీ, ఎంఎస్‌డీసీ, సైనికుల కుటుంబాలపై ఆధారపడిన మహిళలకు నిర్వహించిన బ్యూటీ థెరపీ, టైలరింగ్ తదితర స్వల్పకాల వ్యవధి వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ తరగతులు ముగిశాయి. బుధవారం ఏటీఐ సెంటర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న 100 మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్మీ అధికారులు, ఏటీఐ రీజినల్ డైరెక్టర్ కె. శ్రీనివాస్‌రావు, ఐఎస్‌డీఎస్, షార్ట్ టర్మ్ ట్రైనింగ్ ఇన్‌చార్జ్ వీవీ సతీష్‌రెడ్డిలు సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు.

విద్యుత్ హైమాస్ట్ వీధి దీపాల ఏర్పాటు

కాచిగూడ: బాగ్ అంబర్‌పేట్ డివిజన్ మల్లికార్జుననగర్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న హైమాస్ట్ వీధి దీపాల ఏర్పాటు పనులను బుధవారం కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మల్లికార్జుననగర్ దేవాలయం వద్ద వీధి దీపాల ఏర్పాటు కోసం స్తంభం పెట్టిన అనంతరం చెట్లకొమ్మలు అడ్డుగా వచ్చాయన్నారు. చెట్ల కొమ్మలను తొలగించిన తర్వాత వీధి దీపాలను ఏర్పాటు చేశామన్నారు. బీజేపీ నేతలు చుక్కా జగన్, రమేష్ ముదిరాజ్, బాలకృష్ణ, రాజశేఖర్, మన్సూర్ తదితరులున్నారు.

జూనియర్ పంచాయతీ సెక్రటరీల డిమాండ్లను పరిష్కరించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ సెక్రటరీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి తక్షణమే సమ్మెను విరమింపజేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గత రెండు వారాలుగా నిరవధిక సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ సెక్రటరీలకు కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ సెక్రటరీలతో అనేక సేవలు చేయించుకుంటూ వారి పట్ల సవితి తల్లి ప్రేమను కనబరుస్తోందని విమర్శించారు. ముగిసిన ప్రొబిషన్ పిరియడ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇచ్చిన జీవోలకు కట్టుబడి వారిని క్రమబద్ధీకరించి చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు. మొదట మూడేళ్ల ప్రొబిషన్ అన్న సీఎం మరో ఏడాదికి పెంచి నాలుగేళ్లు పూర్తయినా క్రమబద్ధీకరించకపోవడం బాధాకరమన్నారు. పక్క రాష్ట్రంలో రెండేళ్ల కాలానికే క్రమబద్ధీకరించిన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మర్చిపోవద్దని గుర్తు చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెను విరమింపజేసి వారిని చర్చలకు పిలిచి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ వేద విజ్ఞానాన్ని కలిగి ఉండాలి

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ వేద విజ్ఞానాన్ని కలిగి ఉండాలని వక్తలు పేర్కొన్నారు. మోహన్‌ట్రస్ట్, ఆదిలీల ఫౌండేషన్, రవిమన్యు ఆర్ట్స్ ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాయగానసభలో నిర్వహించిన వేద విజ్ఞానం సమాలోచన కార్యక్రమం నిర్వహించారు. చారిత్రక నవలాచక్రవర్తి ముదిగొండ శివప్రసాద్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, పోలీసు అధికారి తేజావత్ రామదాసులు మాట్లాడుతూ.. వేద విజ్ఞానం మనిషిని ఎంతో ముందుకు నడిపిస్తుందన్నారు. సమాజానికి తమవంతు సేవలు అందించాలనే ఆలోచన కలిగించే అంశాలపై ఎప్పుడూ.. ఆసక్తి కనబరచాలన్నారు. ఈ సందర్భంగా వైద్యుడు డాక్టర్ శూలపాణి నిర్వహించిన భక్త పోతన ఏకపాత్రభినయం రసవత్తరంగా సాగింది. ప్రముఖులు ఆదినారాయణ, మోహన్‌గాంధీ, రవిమన్యు కళాకారులను అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

చిక్కడపల్లి: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా వెర్లపాడు మండలం నందలూరు గ్రామానికి చెందిన కొప్పుల కిశోర్ (33)కు అదే గ్రామానికి చెందిన తన మేనమామ కుమార్తె లక్ష్మి తిరుపతమ్మతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె చరిత(12), కుమారుడు బిస్వా(10) ఉన్నారు. మూడేళ్ల క్రితం బ్రతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన కిశోర్ చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయం వీధిలో ఐఎఫ్‌బీ వాషింగ్ మెషీన్ రిపేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. గత కొంతకాలంగా కిశోర్ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. కాగా బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో టేబుల్‌క్లాత్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా కుటుంబ కలహాలు కూడా కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. వారు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పదోతరగతి ఫలితాల్లో

ఆణిముత్యాలు !

చదువుకు పేదరికం అడ్డుకాదని, కష్టపడి చదివితే ఫలితం ఉంటుందని ముషీరాబాద్ జోన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిరూపించారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జామై ఉస్మానియా ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు 9.8 జీపీఏ సాధించి శభాష్ అనిపించుకుని టాపర్లుగా నిలిచారు.

- సత్తాచాటిన పేద విద్యార్థులు
- ముషీరాబాద్ జోన్‌లో 79 శాతం ఉత్తీర్ణత

ముషీరాబాద్: జోన్ పరిధిలో మొత్తం 7 ప్రభుత్వ పాఠశాలల నుంచి 302 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 238 మంది విద్యార్థులు (79 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

నల్లకుంటలో అత్యధిక ఉత్తీర్ణత శాతం...



అసంపల్లి రూపస్

- నల్లకుంట ప్రభుత్వ పాఠశాలలో 16 మంది విద్యార్థులకు 15 మంది ఉత్తీర్ణత (94 శాతం) సాధించారు.
- రాంనగర్‌లోని జమిస్తాన్‌పూర్‌లో 23 మంది విద్యార్థులకు 17 మంది (74) శాతం ఉత్తీర్ణత కనబరిచారు.
- ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో 76 మందిలో 67 మంది విద్యార్థులు (88) శాతం ఉత్తీర్ణులయ్యారు.



జామై ఉస్మానియా విద్యార్థి కీర్తన

- జామై ఉస్మానియా పాఠశాలలో 61 మంది విద్యార్థులకు 52 మంది (85 శాతం) ఉత్తీర్ణులు కాగా.. కవాడిగూడ పాఠశాలలో 54 మందికి 45 మంది (83 శాతం) పాస్ అయ్యారు.
- సీతాఫల్‌మండిలో 54 మంది పరీక్ష రాయగా 33 మంది (61 శాతం) మాణికేశ్వర్‌నగర్‌లోని జమిస్తాన్‌పూర్ పాఠశాలలో 18 మంది పరీక్ష రాయగా.. 9 మంది (50 శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- మాణికేశ్వర్‌నగర్, సీతాఫల్‌మండి పాఠశాలల విద్యార్థులు అత్యల్పంగా ఉత్తీర్ణత సాధించి వెనుకబడ్డారు.

సమాజ సేవకురాలికి 10 జీపీఏ..

చిన్నతనం నుంచే సమాజ సేవ చేయడంలో ముందుంటూ తన ప్రతీ పుట్టిన రోజున పేద విద్యార్థుల మధ్యన నిర్వహించుకుంటూ.. వారికి ఆర్థిక సహకారం అందించే సిరిగిరి హాసిని 10/10 జీపీఏ సాధించి చదువులోనూ తాను తక్కువేమి కాదని నిరూపించుకుంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డిలు విద్యార్థిని అభినందించి సత్కరించారు.



విద్యార్థులను సత్కరిస్తున్న సెయింట్ పాయిస్ ప్రిన్సిపాల్ సిస్టర్ లిండా జరాల్డ్

సెయింట్ పాయిస్‌లో 98 శాతం ఉత్తీర్ణత..

- రాంనగర్‌లోని సెయింట్ పాయిస్ ఎడెడ్ హైస్కూల్‌లో 292 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 285 మంది (98 శాతం) ఉత్తీర్ణత సాధించారు. వారిలో నలుగురు విద్యార్థులు 10/10 జీపీఏ సాధించినట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ లిండా జరాల్డ్ తెలిపారు.
- సెయింట్ ఫ్రాన్సీస్ ఆఫ్ అసీసీ ఎడెడ్ పాఠశాలలో 91 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 89 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 10 జీపీఏ ఓ విద్యార్థి సాధించగా 9.8 జీపీఏలు ఇద్దరు విద్యార్థులు సాధించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ముషీరాబాద్ జోన్ విద్యాశాఖ అధికారి చిరంజీవి తదితరులు



జామై ఉస్మానియా విద్యార్థి జి.శ్రావణి

డీడీవీటీఆర్‌సీ వంద శాతం ఫలితాలు..



10/10 జీపీఏ సాధించిన హాసిని

నల్లకుంట: పదో తరగతి ఫలితాల్లో నల్లకుంటలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఒకేషనల్ ట్రెనింగ్ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ (డీడీవీటీఆర్‌సీ) బధిరుల పాఠశాల వంద శాతం ఫలితాలు సాధించిందని సెంటర్ ప్రిన్సిపాల్ ఆకుల పద్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు.

సమ్మె చేస్తున్న వారిని తొలగిస్తామనడం దారుణం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య

ముషీరాబాద్: గత 13 రోజులుగా సమ్మె చేస్తున్న 9,355 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను సమ్మె విరమించుకోకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ బెదిరించడం నిరంకుశ చర్య అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా తెలంగాణ తెచ్చి ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ అదే ఉద్యమాలను అణచివేయడం న్యాయమా అని ప్రశ్నించారు. ఈ నిరంకుశ వైఖరిని ముఖ్యమంత్రి మార్చుకోవాలని హెచ్చరించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె న్యాయమైనదని వీరిని ఉద్యోగాల్లోకి తీసుకున్నప్పుడే మూడు సంవత్సరాల్లో రెగ్యులరైజ్ చేస్తామని నోటిఫికేషన్‌లలో స్పష్టంగా పేర్కొన్నారని తరువాత జీవో 26 ద్వారా మరో సంవత్సరం పొడగించారని తెలిపారు. జీవో 26 ప్రకారం నాలుగు సంవత్సరాలు గడిచినా రెగ్యులర్ చేయకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు వెళ్లారన్నారు. వీరి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కేసీఆర్ తన నియంతృత్వ వైఖరిని మార్చుకోవాలని, పంచాయతీ కార్యదర్శులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. సమావేశంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, రాఘవజోషి పాల్గొన్నారు.

వ్యాపారుల పార్కింగ్‌కు ఇబ్బందులు రాకుండా చర్యలు

చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్స్ నుంచి అశోక్‌నగర్ వరకు దుకాణదారుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ హామీనిచ్చారు. స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం అనంతరం ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా పాదచారుల దారి, యూటర్న్, పార్కింగ్ కోసం స్థల ఏర్పాటు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక వ్యాపారులు, దుకాణ యజమానులు సింగారపు రమేష్‌గుప్తా, నగేష్, రమేష్‌జైన్, మోజిత్ మహవీర్ తదితరులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వ్యాపారులతో కలసి స్థానికంగా పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. వ్యాపారుల విజ్ఞప్తి మేరకు పనులు చేపట్టాలని కార్పొరేటర్ ఈఈ గోపాల్‌కు సూచించారు. బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, రత్న సాయిచంద్, శ్రీకాంత్, నర్సింగ్‌రావు, శివకుమార్, సంయుక్త రాణి తదితరులున్నారు.

రైల్వే స్టేషన్ అండర్ బ్రిడ్జి ఏర్పాటుకు స్థల పరిశీలన

కాచిగూడ: స్థానిక రైల్వే స్టేషన్ వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ఇటీవల అధికారులకు సూచించారు. ఈమేరకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. దీంతో బుధవారం హైదరాబాద్ రైల్వే డీఆర్ఎం శరత్ చంద్రయాన్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ నేతలు ఉన్నారు.



పోస్టల్ ఉద్యోగుల యూనియన్ గుర్తింపును పునరుద్ధరించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పోస్టల్ ఉద్యోగులకు రక్షణ కవచంగా ఉండి ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని ఉద్యోగుల మద్దతు కలిగిన ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ గ్రూప్–సి యూనియన్‌ల గుర్తింపును పునరుద్ధరించాలని పలువురు వక్తలు కోరారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఆల్ ఇండియా పోస్టల్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి సురేష్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఏ.నాయుడు, ఏఐటీయూసీ నాయకులు వీ.ఎస్.బోస్, సీఐటీయూ నాయకులు ఎస్.ఎస్.ఏ.ప్రసాద్‌లు మాట్లాడారు.

- ఏప్రిల్ 24, 2023న గుర్తింపు యూనియన్‌లను ప్రభుత్వం రద్దు చేయడం పోస్టల్ ఉద్యోగులందరికీ బ్లాక్ డే అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, భారత కార్మిక, ఉద్యోగ కార్మిక వర్గానికి ఒక మార్గదర్శకంగా నిలిచిన ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ గ్రూప్–సిల యూనియన్‌ల గుర్తింపును ప్రభుత్వం రద్దు చేయడం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- స్వాతంత్య్ర పోరాటంలోనే బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 1946లో పోరాటాలు చేసిన చరిత్ర కలిగిన యూనియన్ ఎన్ఎఫ్‌పీఈ అని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.
- 1960లో రెండో వేతన కమిటీ, తక్కువ వేతన సిఫారస్సుకు వ్యతిరేకంగా సమ్మె చేయగా.. అప్పటి ప్రధాని నెహ్రూ సమ్మెకు గల సమస్యలను పరిష్కరించారన్నారు. అంతటి చరిత్ర కలిగిన ఈ యూనియన్‌ల గుర్తింపు రద్దు చేయడం బాధాకరమన్నారు.
- పోస్టల్ శాఖ ప్రైవేటీకరణ కాకుండా గత 32 ఏళ్లుగా పోరాటం చేస్తుందన్నారు. ఈ నెల 14న తమ యూనియన్‌ల గుర్తింపును పునరుద్ధరించాలని కోరుతూ.. కేంద్ర కమ్యూనికేషన్స్ మినిస్టర్, సెక్రటరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్‌గార్లకు మెమోరండం అందజేస్తామన్నారు.
- 28న నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులు ధరించి మానవహారం నిర్వహిస్తామని జూన్ 10న అన్ని సంఘాలతో కలిసి మాస్ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జలాలుద్దీన్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు కుమార్, ఎస్‌బీఐ యూనియన్ నాయకులు శ్రీరామ్, నగేష్ తదితరులున్నారు.

రేషన్‌షాపుల్లో 12 రకాల నిత్యావసరాలను పంపిణీ చేయాలి



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని గ్యాస్ సిలిండర్‌ను సగం సబ్సిడీతో పాటు అర్హులైన పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు పీవైఎల్, పిఓడబ్ల్యూ ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యావసర ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా ఉన్నాయని నగరంలో ఎక్కువ మంది రెక్కల కష్టం మీద జీవనాధారం ఉన్న వారేనన్నారు. ప్రతి వస్తువు కొనుక్కోవాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వాలు 9 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వడంతో ప్రజలకు సర్దుబాటు అయిందన్నారు. 12 రకాల నిత్యవసర సరుకులు మంచినూనె, కందిపప్పు, ఉప్పు, కారం, పసుపు, పల్లీలు, పంచదార, టీపొడి, గోధుమలు, చింతపండు తదితర వాటిని అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఐదు కేజీల బియ్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మరో 5 కేజీలను అందించాలన్నారు. పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ప్రదీప్, డి.స్వరూప, వరలక్ష్మి, కృష్ణరవి కుమార్, దేవమణి, కిరణ్ తదితరులున్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



క్రికెట్ కిట్లను అందజేస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీలు

కవాడిగూడ: యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించి దేశం, రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ యువతకు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ కూచిపూడి గ్రౌండ్‌లో కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పది బస్తీల యువతకు క్రికెట్ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసికంగా, శారీరకంగా ఉల్లాసంగా ఉండేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు చదువుతో పాటు క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ ఎం.రమేష్‌రాం, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, నగర నాయకులు ఆంజనేయులు, భరత్‌గౌడ్, శ్రీనివాస్‌ముదిరాజ్, రమేష్‌గౌడ్, విఠల్‌రావు, లింగంగౌడ్, చంద్రయ్య, గంటా శ్రీనివాస్, కుమార్‌గౌడ్, హరీష్‌గౌడ్, అనిల్, మోహన్ సాయి, రమేష్‌తో పాటు వివిధ బస్తీలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

'సర్పంచ్‌ల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే'



మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

ముషీరాబాద్: దేశంలో ఎక్కడ లేని విధంగా అప్పుల పాలైన సర్పంచ్‌లు రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగానే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని సర్పంచ్‌ల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలేనని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా పల్లె ప్రగతి, రైతు వేదికలు, ప్రకృతి వనం, గ్రామ రోడ్లు, డ్రైనేజీ, డంపింగ్ యార్డు, క్రీడా ప్రాంగణాల ఏర్పాటు, వైకుంఠదామాలతో పాటు పలు అంశాల నిర్వహణకు నిర్దేశించిన నిధులు ఇవ్వకుండా ప్రతి గ్రామ పంచాయతీ రూ.10 నుంచి రూ.50 లక్షల వరకు సొమ్మును ఖర్చు చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.3 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల అమలు కోసం రాష్ట్రానికి విడుదల చేసిన నిధులను ఇతర పనులకు మళ్లించారని ఆరోపించారు. ఈ నెల 13న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు భూమన్నయాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, తెలంగాణ నిరుద్యోగ జాక్ చైర్మన్ నీల వెంకటేష్, రాజేందర్, అనంతయ్య, సుధాకర్‌ముదిరాజ్ తదితరులున్నారు.

బీసీ రిజర్వేషన్లను 54 శాతానికి పెంచాలి



కాచిగూడ: బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 54 శాతానికి పెంచాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. సీఎం కేసీఆర్ చీఫ్ అడ్వైజర్‌గా నూతనంగా సోమేష్ కుమార్ ఐఏఎస్ నియమితులైన సందర్భంగా బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ జనాభాలో 70 కోట్ల వరకు ఉన్న బీసీల రిజర్వేషన్ల పెంపునకు వీలుగా రాజ్యాంగ సవరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగాలకు నోచుకోని వెనుకబడిన బీసీ కులాల అభివృద్ధికి రిజర్వేషన్ల పెంపుతో మేలు జరుగుతుందన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం విద్యుత్ అధికారులు, సిబ్బందితో కలిసి గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేటలో విద్యుత్ పనుల అభివృద్ధి కోసం రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రాధాన్యత క్రమంలో విద్యుత్ పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అంబర్‌పేటలో నూతనంగా విద్యుత్ లైన్లు, పాత విద్యుత్ స్తంభాలు మార్చడం, చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చి కొత్తవాటిని ఏర్పాటు చేయడం లాంటి పనులను చేపడతామన్నారు. ఎస్ఈ బ్రహ్మం, డీఈ కమలాకర్, ఏడీ శివయ్య, ఏఈలు శ్రీనివాస్, ప్రసాద్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

చిక్కడపల్లి: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ఎస్.సంజయ్‌కుమార్, ఎస్సై నాగరాజులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమలగూడలోని హైదరాబాద్ ఫుడ్‌కోర్టు పక్కన ఫుట్‌పాత్‌పై ఫిట్స్ వచ్చి కింద పడిపోయి ఉన్న ఓ వృద్ధుడిని ఈ నెల 3న ఉదయం చిక్కడపల్లి పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా అతను చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.